సాక్షి
ప్రకాశం
గురువారం । 6 । జూన్ । 2024



నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలి

మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు క్రాస్ అవుతున్న కారును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. - 8లో..



పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు

త్రిపురాంతకం మండలం గణపవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి టీడీపీ నాయకులు పసుపు రంగు వేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాపై నమ్మకంతో గెలిపించినందుకు ధన్యవాదాలు

● దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: తనపై నమ్మకంతో గెలిపించినందుకు దర్శి నియోజకవర్గ ప్రజలకు, తన గెలుపునకు కృషి చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జగనన్నపై నమ్మకంతో, వైఎస్సార్ సీపీపై అభిమానంతో తనను గెలిపించినందుకు నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు

బేస్తవారిపేట: సార్వత్రిక ఎన్నికల్లో అండగా నిలిచిన గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఫలితం ఏదైనా.. పార్టీ కోసం కష్టపడిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. నన్ను ఆదరించిన నియోజకవర్గ ప్రజలకోసం, పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం అండగా ఉంటానన్నారు. ఓటమి పట్ల నిరాశ, నిస్పృహలకు గురి కావద్దని, కోప తాపాలు చెందకుండా సంయమనం పాటించాలని కోరారు. గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ఉంచడానికి ప్రజలందరి పక్షాన కలిసి నడుద్దామని కోరారు.

గొడవలు వద్దు.. ప్రశాంతంగా ఉండండి



కె.పల్లెపాలెంలో మత్స్యకారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జగదీష్

కొత్తపట్నం: 'అందరూ కష్టపడి పనిచేసేవాళ్లు. మీకెందుకు గొడవలు. ప్రశాంతంగా ఉండండి' అని రెంటో పట్టణ సీఐ జగదీష్ మత్స్యకారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని కె.పల్లెపాలెంలో బుధవారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. దీంతో విషయాన్ని గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లారు. అయితే గ్రామ కాపు, పెద్దలు మాట వినకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై బి.సాంబశివరావు సంఘటనా స్థలానికి చేరుకొని గొడవలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా అదుపు కాకపోవడంతో ఒంగోలు నుంచి అదనపు బలగాలను తెప్పించారు. సుమారు 30 మంది పోలీసులు గ్రామానికి చేరుకొని గొడవలకు కారకులను చెదరగొట్టారు. గ్రామంలోని నాయకులను పిలిచి మాట్లాడారు. చిన్న గొడవలే పెద్ద పెద్ద సంఘటనకు దారితీస్తున్నాయని, అందరూ కలిసిమెలసి ఉండాలని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కేసులు నమోదు చేయవద్దని, ప్రశాంతంగా ఉంటామని చెప్పడంతో పోలీసులు వెళ్లిపోయారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి బుధవారం 45 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులతో పుస్తక పఠనం చేయించారు. చిన్నారుల సందేహాలను తీర్చారు. కెరీర్‌ను తీర్చిదిద్దుకోడానికి చిన్నారులు ఎలాంటి పుస్తకాలు చదవాలన్న విషయంపై అవగాహన కల్పించారు. ఇంగ్లిష్ కథలను చెప్పి అందులోని పదాలను పిల్లలతో పలికించడం చిన్నారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించింది. పిల్లలతో కథలను చెప్పించారు. దేశభక్తి గీతాలు నేర్పించారు. అలాగే బొమ్మలు గీయడంలో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీతో వేసవి శిబిరాన్ని ముగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షించారు. జాలాది మోహన్ బాబు, ఎం వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ సుధాకర్ రావు, టి.శ్రీనివాసరావు, టి.రవీంద్ర, శిరీష, కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.ఇమ్మానియేలు, ఎస్ అనిల్‌బాబు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల భవితకు బంగారు బాటలు పడుతున్నాయి. దివ్యాంగ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసి, సాధారణ పిల్లలతో కలిసి సాగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మండలాల వారీగా భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రత్యేక పద్ధతుల్లో పాఠాల బోధన, ఫిజియోథెరపీ చికిత్సను అందిస్తోంది.

- చిన్నారుల గుర్తింపునకు 9 వరకు సర్వే
- ఇంటింటికీ రిసోర్స్ పర్సన్స్
- 215 మందికి ట్యాబ్‌ల పంపిణీ



మార్కాపురంలో ఉపకరణాలు ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొన్న అధికారులు

జిల్లాలో భవిత కేంద్రాలు	38
సహిత విద్యా రిసోర్స్‌పర్సన్స్	75
ఫిజియోథెరపిస్టులు	13
భవిత కేంద్రాల్లో నమోదైన వారు	495
ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు	580

భవిత.. భరోసా..

మార్కాపురం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. చిన్న వయసులోనే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి వారిని శారీరకంగా, మానసికంగా సన్నద్ధం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 38 భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి, ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ 495 మంది విద్యార్థులు భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల కోసం నమోదు చేసుకోగా ఈ నెల 9 వరకు విద్యార్థుల సర్వేను మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు సర్వేలో 580 మంది పిల్లలు ప్రత్యేక అవసరాలు కలిగిన వారిగా గుర్తించారు. వీరందరినీ పాఠశాలలు తెరిచే సమయానికి పాఠశాలలో చేర్పించి ఒక వైపు చదువు చెబుతూ మరో వైపు వారిలో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవిత కేంద్రాల ద్వారా ఫిజియోథెరపిస్టులతో వారికి ప్రత్యేక సేవలు అందించనున్నారు. ఇలా 21 రకాలైన ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 75 మంది సహిత విద్యా రిసోర్స్‌పర్సన్స్ ఉండగా 38 భవిత కేంద్రాల్లో 38 మంది ఆయాలు, 13 మంది ఫిజియోథెరపిస్టులు ఉన్నారు.

ఉచిత ఉపకరణాలు

మే 1వ తేదీ నుంచి జూన్ 9 వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో రిసోర్స్‌పర్సన్స్ ఇంటింటికీ తిరిగి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల వివరాలు సేకరించి తల్లిదండ్రుల ఆమోదంతో పాఠశాలలో చేర్పిస్తున్నారు. వీరికి ఫిజియోథెరపిస్టు సేవలతో పాటు ఉచిత ఉపకరణాలు, బోధనోపకరణాలు, గ్రహణ మొర్రి, గ్రహణసూలకు ఉచిత శస్త్ర చికిత్సలు చేయిస్తారు. జిల్లా వ్యాప్తంగా వీరికోసం హైస్కూల్స్‌లో ప్రత్యేక విద్యను బోధించే ఉపాధ్యాయులు 45 మంది ఉన్నారు. కాగా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ట్రాన్స్‌పోర్టుతో పాటు అమ్మాయిలకు స్టైఫండ్, అసిస్టెంట్లకు కూడా రవాణా ఖర్చులు అందిస్తున్నారు.



స్పెషల్ టీచర్ల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర



పిల్లల ట్యాబ్స్ వాడకాన్ని పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ రమేష్

142 మందికి ఉపకరణాలు



ఈ విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులను గుర్తించి 215 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేశాం. 142 మంది విద్యార్థులకు బోధనోపకరణాలు అందించాం. రూ.21.95 లక్షల అలవెన్సులను లబ్ధిదారులకు వారి ఖాతాల్లో జమ చేశాం. పదో తరగతి ఫలితాల్లో 151 మంది దివ్యాంగులు ఉత్తీర్ణులు కావడం సంతోషంగా ఉంది.

– రమేష్, సహిత విద్య కో ఆర్డినేటర్, ఒంగోలు

ప్రత్యేక ప్రయోజనాలు



జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వీరంతా పాఠశాలలో తమ పేర్లను నమోదు చేసుకుంటే సమగ్ర శిక్ష ద్వారా అనేక ప్రయోజనాలను కల్పిస్తున్నాం. 4 రకాలైన అలవెన్సులు, ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్, రీడర్, గరల్స్ స్టైఫండ్, ఉపకరణాలు, బోధనాభ్యాస సామగ్రి, ఫిజియోథెరపి సేవలు, ప్రత్యేక విద్యను ఉచితంగా అందచేస్తాం. సదరం సర్టిఫికెట్ల నమోదు, హెల్త్ ఇన్సూరెన్స్, నిర్ధారణ శిబిరాలకు తీసుకురావడంలో భవిత కేంద్రాల్లో పని చేస్తున్న రిసోర్స్‌పర్సన్స్ సహాయ పడతారు. పాఠశాలలకు రాలేని విద్యార్థులకు ప్రతి శనివారం ఇంటి వద్దే అందజేస్తాం. జూన్ 10 లోగా మండల స్థాయి ప్రత్యేక అవసరాల విద్యార్థుల గుర్తింపు, నమోదు చేసుకోవాలి. సర్వే అనంతరం సంబంధిత ప్రొఫార్మాలను జిల్లా కార్యాలయానికి పంపుతారు.

– సుభద్ర, డీఈఓ, ఒంగోలు



గిద్దలూరులో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయుల బృందం

గోడౌన్‌కు చేరిన ఈవీఎంలు





ఈవీఎంలను లారీలో ఎక్కిస్తున్న సిబ్బంది

- ఎన్నికల్లో వినియోగించిన బ్యాలెట్ యూనిట్‌లు 6549
- కంట్రోల్‌యూనిట్‌లు 4366, వీవీ ప్యాట్‌లు 4366

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లు మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కాగానే అర్ధరాత్రి నుంచి పోలీసు బందోబస్తుతో మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌కు తరలించి భద్రపరిచారు. రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం 25 గదులు ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఈవీఎంలను గోడౌన్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభించారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు, సూచనల మేరకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈవీఎంలను భద్రపరిచారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలో కలిపి మొత్తం 6549 బ్యాలెట్ యూనిట్‌లు వినియోగించగా కంట్రోల్ యూనిట్‌లు (సీయు)లు అసెంబ్లీ నియోజకవర్గానికి 2183, పార్లమెంట్ నియోజకవర్గానికి 2183 చొప్పున వినియోగించారు. అదేవిధంగా వీవీప్యాట్‌లు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 2183, పార్లమెంట్ నియోజకవర్గాలకు 2183 చొప్పున వినియోగించారు. ఈవీఎంలు భద్రపరిచే ప్రక్రియను ఎన్నికల అధికారులతో పాటు పోలీసు అధికారులు పర్యవేక్షించారు. బుధవారం రాత్రికి మొత్తం ఈవీఎంలను గోడౌన్‌లో భద్రపరిచి అక్కడ భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

బూచేపల్లి, తాటిపర్తిలను కలిసిన చెవిరెడ్డి



చెవిరెడ్డితో మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

సింగరాయకొండ/చీమకుర్తి: జిల్లాలో దర్శి, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలుగా గెలుపొందిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్‌లను వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత సింగరాయకొండలోని తాటిపర్తి నివాసానికి వచ్చిన చెవిరెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సోమిశెట్టి సురేష్‌బాబు, షేక్ మస్తాన్ ఉన్నారు. అనంతరం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో శివప్రసాద్‌రెడ్డితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను కలిశారు. ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర

ఒంగోలు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని డీఈఓ డి.సుభద్ర అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పర్యావరణ హితానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, వాటి స్థానంలో క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. నీటిని సంరక్షించే వ్యవసాయ పద్ధతులు పాటించాలని, వర్షం నీరు ఆదా చేయడం, నీటిని వృథా చేయరాదని పలు సూచనలు చేశారు. విద్యుత్ పొదుపుకు సీఎల్‌ఎఫ్ బల్బులు, ఎల్‌ఈడీ బల్బులు వినియోగించాలని కోరారు. పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ వాయువుల కోసం ఎక్కువ చెట్లు నాటడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోగలుగుతామన్నారు. ఈ నెల 12 నుంచి 19వరకు అన్ని పాఠశాలల్లో ఎకో క్లబ్బులు ద్వారా పర్యావరణ హిత జీవన శైలిని విద్యార్థుల్లో అలవరచుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి అనితరోజ్‌రాణి, పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి, ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ ఎం.సజీవరాజు, ఎంఈఓ డి.వెంకారెడ్డి, సీఎంఓ శ్రీనివాసరావు, డీఎస్‌ఓ టి.రమేష్, కె.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

పొగాకు గరిష్ట ధర రూ.332



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో బుధవారం జరిగిన వేలంలో 4538 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. వేలంలో గరిష్ట ధర రూ.332, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.277.70 పలికింది. జిల్లాలోని వివిధ కేంద్రాల నుంచి రైతులు 4919 బేళ్లను వేలానికి తీసుకురాగా 4538 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 381 బేళ్లను తిరస్కరించారు. 73 రోజుల పాటు జరిగిన వేలంలో ఇప్పటి వరకు 2,65,822 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం సరాసరి ధర కేజీ రూ.261.29 పలికింది. పొందూరు క్లస్టర్ గ్రామాల రైతులు వేలానికి 900 బేళ్ల తీసుకురాగా 840 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.332, కనిష్ట ధర రూ.205 పలికింది. వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



కొండపిలో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో బుధవారం సరాసరి ధర రూ.292.71 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. చౌటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి గ్రామాలకు చెందిన రైతులు 1098 బేళ్లను వేలానికి తీసుకురాగా 1055 బేళ్లను కొనుగోలు చేయగా 43 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.320, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.292.71 పలికింది. వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షతోనే జీవరాశుల మనుగడ



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మాధవీలత, తదితరులు

ఒంగోలు టౌన్: భూమిపై జీవరాశుల మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.మాధవీ లత పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హరిత ప్రకాశం ఆధ్వర్యంలో నగరంలోని పాత రిమ్స్ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఊహించని రీతిలో పెరిగిపోవడానికి చెట్లు నరికి వేయడం కూడా ఒక కారణమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని, లేకపోతే రానున్న రోజుల్లో పర్యావరణంలో పెను మార్పులు సంభవిస్తాయని చెప్పారు. ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వాహణాధికారి డాక్టర్ శ్రీవాణి, జిల్లా లెప్రసీ కార్యాలయ సూపరెండెంట్ పయ్యావుల శ్రీనివాసరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరిత ప్రకాశం ఫౌండేషన్ కార్యకర్తలు సీహెచ్ మాధవరావు, షేక్ మహబూబ్ బాషా, పి.మోహన్‌రావు, బి.కృష్ణ, కె.కమల్, షేక్ అలీ, జి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



దూదేకుల ఖాసింపీరా

పెద్దదోర్నాల: వైఎస్ జగన్‌మోహనరెడ్డి అంటే తనకు ప్రాణమని, అందుకే ఆయన హయాంలో తనకు సంక్రమించిన దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని చిన్నదోర్నాలకు చెందిన దూదేకుల ఖాసింపీరా స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన రాజీనామా లేఖను సంబంధిత శాఖ అధికారులకు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు తెలిపారు. ఇంత కాలం తనను గుర్తించి ఆదరించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డికి, వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏదో జరిగింది..!

- ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఓటర్ల అనుమానం
- కూటమి అభ్యర్థుల భారీ మెజారిటీలపైనా సందేహాలు
- బూత్‌ల వారీ మెజారిటీలు చూసి విస్తుపోతున్న ఓటర్లు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్ సీపీ శ్రేణులతోపాటు ఓటర్లలోనూ సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ అనుకూల ఓటర్లు అధికంగా ఉన్న బూత్‌ల్లో సైతం కూటమి అభ్యర్థులకు మెజారిటీ రావడమే సందేహాలకు కారణం. 'ఫలితాలు చూస్తుంటే తమ ఓట్లన్నీ ఏమయ్యాయో అంతుపట్టడం లేదు. ఎన్నికల ప్రక్రియపైనే అనుమానంగా ఉంది' అని జిల్లా వ్యాప్తంగా ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



ఫలితాలు నమ్మశక్యంగా లేవు



ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యాన్ని కలిగాయి. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా వైఎస్సార్ సీపీపై పెద్దగా వ్యతిరేకత లేదు. కానీ కూటమి అభ్యర్థులకు ఎక్కడ చూసినా 50 వేల పైచిలుకు మెజారిటీలు రావడం నమ్మశక్యంగా లేదు. మా గ్రామంలో ఎక్కువగా వైఎస్సార్ సీపీకే ఓట్లు వేశాం. అయినా మెజార్టీ తక్కువ రావడం అనుమానాలకు తావిస్తోంది.

- అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, పెద ఉల్లగల్లు(ముండ్లమూరు)

అందరికీ అనుమానాలు ఉన్నాయి



వైఎస్సార్ సీపీకి ఇంత ఓటమి రావడం ఆశ్చర్యంగా ఉంది. ఐదేళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా కోట్ల రూపాయలు ఖాతాల్లో జమ చేశారు. మా గ్రామంలో చాలా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారు. అయినా ఎన్నికల ఫలితాలు మరో విధంగా వచ్చాయి. ప్రజల ఆదరణ ఉన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఓడిపోవడంతో పాటు కూటమి అభ్యర్థులకు భారీగా మెజార్టీలు రావడం అనుమానాలకు తావిస్తోంది.

- వెన్నపూస లక్ష్మి, చెన్నిపాడు(పొన్నలూరు)

ఓట్లు సమానంగా రావడమేంటో



మా గ్రామంలో ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మంచి మెజారిటీ వస్తుంది. ఈ కానీ ఒక్క ఓటు కూడా మెజారిటీ రాలేదు. రెండు పార్టీలకు సమానంగా ఓట్లు వచ్చాయి. ఇటువంటి ఫలితం రావడం నిజంగా ఆశ్చర్యంగా ఉంది. గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఓట్లు స్వేచ్ఛగా వేసుకున్నారు. కానీ ఫలితం ఈ విధంగా రావడం ఏంటో అర్థం కావడం లేదు.

- వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, గుండ్లాపల్లి(మద్దిపాడు)

ఎక్కడో ఏదో జరిగింది



మా మండలం మొదటి నుంచి వైఎస్సార్ సీపీకి మెజారిటీ వస్తుంది. కానీ ఎక్కడో ఏద జరిగింది. మేమంతా షాక్‌లో ఉన్నా. ఎక్కడ ఒకరిద్దరు గుమిగూడినా ఇదే చర్చకు వస్తుంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగించారు. కానీ ఫలితాలు మాత్రం ఈ స్థాయిలో వస్తాయని ఊహించలేదు.

- సయ్యద్ ముజాయిద్, దొనకొండ

ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయి



రాష్ట్రంలో ఐదేళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా పనిచేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించారు. గతంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం లేదు. ఒక్కో కుటుంబం రూ.లక్షల్లో లబ్ధి పొందింది. కానీ ఫలితాలు ఇంత వ్యతిరేకంగా రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎక్కడ పొరపాటు జరిగిందో అర్థం కావడం లేదు.

- డిష్ మున్నా, జేసీఎస్ కన్వీనర్, కంభం

ఈ ఫలితాలు అంతుపట్టడం లేదు



వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉన్న కొత్తపట్నంలో టీడీపీకి మెజారిటీ రావడం ఏంటో మాకు అంతుపట్టడం లేదు. గ్రామంలో ఎవరినీ కదిలించినా ఫ్యాన్ గుర్తుకే ఓటేశామని చెబుతున్నారు. కానీ ఫలితాలు మాత్రం ఇలా వచ్చాయి. ఈవీఎంలను ఏదో చేశారన్న అనుమానాలు కలుగుతున్నాయి.

- ద్వారం నాగరాజు, కొత్తపట్నం

ఎవరూ ఊహించని ఫలితాలు



వైఎస్సార్ సీపీకి ఇలాంటి ఫలితాలు వస్తాయని ఎవరూ ఊహించలేదు. గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ అభిమానులే ఎక్కువగా ఉన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ జగనన్న సంక్షేమ ఫలాలను అందించారు. సంక్షేమ ఫలాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకున్నారు. కానీ ఫలితాలు ఏకపక్షంగా రావడం ఏంటో అంతుపట్టడం లేదు.

- ఎం.రవికుమార్, కొమరోలు

ఫలితాలు అనూహ్యం



సార్వత్రిక ఎన్నికల్లో మా గ్రామంలో వచ్చిన ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. మా గ్రామం పూర్తిగా వైఎస్సార్ సీపీకి అనుకూలం. గతంలో ఏ ఎన్నికలు జరిగినా వెయ్యి ఓట్ల పైనే మెజారిటీ వస్తుంది మా గ్రామంలో. కానీ ఈ దఫా కేవలం 300 ఓట్ల మెజారిటీ రావడం ఆశ్చర్యంగా ఉంది. గ్రామంలో ఎవరినీ కదిలించినా ఏదో జరిగిందన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

- మేకల కృష్ణారెడ్డి, నేలటూరివారిపాలెం(మద్దిపాడు)

ఓట్లన్నీ ఏమయ్యాయో ..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాయి. వారంతా వైఎస్సార్ సీపీకే ఓటేశారు. ఆ ఓటన్నీ ఏమయ్యాయో అర్థం కావడం లేదు. కొండపిలో టీడీపీకి ఇంత మెజారిటీ రావడం ఏంటో అంతుపట్టడం లేదు. ప్రజలకు ఎన్నో అనుమానాలు ఉన్నాయి.

- బొక్కిసం ఉపేంద్ర చౌదరి, టంగుటూరు

తాగునీటి చెరువులో శిశువు మృతదేహం



తాగునీటి చెరువులో పడేసిన నవజాత శిశువు మృతదేహం

కురిచేడు: స్థానిక తాగునీటి చెరువు అట్లపల్లి రిజర్వాయర్‌లో నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం పడేశారు. ఎవరూ లేని సమయంలో మృతదేహాన్ని గోనెసంచిలో తెచ్చి చెరువులో నీటిలో పడేసినట్లు తెలుస్తోంది. శిశువు మృతదేహం నీటిలో తేలుతూ గాలుల ధాటికి ఒడ్డుకు చేరింది. ప్రజలు తాగే నీటిలో విచక్షణ లేకుండా మృతదేహాన్ని పడేయడం దారుణమని, ఈ చర్య మాతృత్వానికే కళంకం తెచ్చేలా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతదేహం ఎవరు పడేశారో గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

అదుపు తప్పిన పాల వాహనం

- చప్టాపై కూర్చున్న వ్యక్తిపై పడటంతో మృతి



గడ్డం లింగేశ్ మృతదేహం

ముండ్లమూరు: వేగంగా వెళ్తున్న పాల వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు-పెద ఉల్లగల్లు మధ్య బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. చిన ఉల్లగల్లు గ్రామానికి చెందిన గడ్డం లింగేశ్(48) గేదెలు మేపేందుకు బుధవారం పొలానికి వెళ్లాడు. సాయంత్రం వేళ గేదెలు వాగు వద్ద ఉండటంతో చప్టా దిమ్మెలపై కూర్చుని ఉన్నాడు. అదే సమయంలో దర్శి నుంచి అద్దంకి వైపు వెళ్తున్న పాల వాహనం అదుపుతప్పి లింగేశ్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు గ్రామస్తులకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని ఎస్సై ఆంజనేయులు పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య కనికరమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు శేషయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా గంగా భవాని తిరునాళ్ల



గంగాభవాని, బొల్లావులను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

పామూరు: మోపాడు రిజర్వాయర్ వద్ద గంగా భవాని అమ్మవారి వార్షిక తిరునాళ్ల నాలుగు రోజులుగా వైభవంగా సాగుతోంది. బుధవారం గావు కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తి, బొల్లావులకు ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలో గంగామాత మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమ పూజ చేశారు. తిరునాళ్ల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో 5 వేల మంది భక్తులకు మహా అన్నసంతర్పణ చేశారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం బండ్లు, పొంగళ్లు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సచివాలయం శిలాఫలకం ధ్వంసం



ఎనికపాడులో ధ్వంసమైన సచివాలయ శిలాఫలకం



ఫిబ్రవరిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మేరుగు నాగార్జున(ఫైల్)

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామంలో సచివాలయ భవనం శిలా ఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం సచివాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి శిలా ఫలకాన్ని ధ్వంసం చేసినట్లు స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. ఈ సచివాలయం నూతన భవనాన్ని ఫిబ్రవరి 18న ప్రస్తుత మాజీ మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు.

పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు

త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలం గణపవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి టీడీపీ నాయకులు పసుపు రంగు వేశారు. ఎన్నికల్లో విజయం సాధించడం, గ్రామ పంచాయతీలో ప్రస్తుతం టీడీపీ పాలక మండలి ఉండటంతో అడ్డు చెప్పేవారు లేరని పసుపు రంగు వేసినట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది.



గణపవరంలో రంగుమారిన పంచాయతీ కార్యాలయం

నిర్లక్ష్యానికి రెండు ప్రాణాలు బలి



ప్రమాదంలో మృతి చెందిన బ్రహ్మయ్య



చిన్నవెలుగొండయ్య

- వెనుక వాహనాలను గమనించకుండా రోడ్డు క్రాస్ చేసిన కారు
- వేగ నియంత్రణ కోల్పోయి ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే ఇద్దరు యువకుల మృతి
- జాతీయ రహదారిపై గొబ్బూరు సమీపంలో ఘటన

పెద్దారవీడు: కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు క్రాస్ అవుతున్న కారును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటన బుధవారం పెద్దారవీడు మండల పరిధిలోని గొబ్బూరు సమీపంలో కంకర మిల్లు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యర్రగొండపాలెం మండల చెన్నరాయునిపల్లి గ్రామానికి చెందిన మేకల బ్రహ్మయ్య(22), పారేటి చిన్నవెలుగొండయ్య(20) కలిసి బైక్‌పై మార్కాపురంలో పిల్లల ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ మాత్రలు తీసుకుని ఇద్దరూ బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. గొబ్బూరు సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కంకర మిల్లు దగ్గరకు వెళ్తున్న కారు డ్రైవర్ వెనుక వస్తున్న వాహనాన్ని చూసుకోకుండా రోడ్డు క్రాస్ అయ్యేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో బైక్‌పై వస్తున్న చిన్నవెలుగొండయ్య, బ్రహ్మయ్య వేగ నియంత్రణ కోల్పోయి కారును ఢీకొట్టారు. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటసైదులు తెలిపారు. ఇద్దరు యువకులు తల్లిదండ్రులతో కలిసి కూలీ పనులకు వెళ్తూ కుటుంబాలకు చేదోడుగా ఉంటున్నారు. చేతికందివచ్చిన కుమారులు మృతి చెండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

'నీట్'లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



షేక్ మహమ్మద్‌జానీ



ఏవీ అరవిందగౌడ్



సమీక్షను అభినందిస్తున్న డాక్టర్ జవహర్

కొమరోలు/మార్కాపురం/చీమకుర్తి: 'నీట్' ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. కొమరోలుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు షేక్ దివాన్‌బాషా కుమారుడు షేక్ మహమ్మద్‌జానీ 629/720 మార్కులతో జాతీయ స్థాయిలో 6,334వ ర్యాంక్ సాధించాడు. దివాన్‌బాషా పెద్ద కుమారుడు కూడా నీట్‌లో ప్రతిభ చాటి ప్రస్తుతం వైజాగ్‌లో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. మహమ్మద్‌జానీకి బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

మార్కాపురం పట్టణానికి చెందిన ఏవీ అరవింద్‌గౌడ్ 670 మార్కులతో జాతీయ స్థాయిలో ఓబీసీ కోటాలో 6251 ర్యాంకు సాధించాడు. ప్రముఖ మెడికల్ కాలేజీలో తమ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు దక్కుతుందని తల్లిదండ్రులు కృష్ణగౌడ్, రాజేశ్వరి సంతోషం వ్యక్తం చేశారు. అరవిందగౌడ్ నవోదయ విద్యాలయ-2లో ఇంటర్ వరకూ చదివాడు. ఎంబీబీఎస్ పూర్తి చేసి కార్డియాలజీలో పీజీ చేయడమే లక్ష్యమని పేర్కొన్నాడు.

చీమకుర్తి కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య సోదరుని కుమార్తె కొమ్ము సమీక్షకు నీట్ ప్రవేశ పరీక్షలో 12009 ర్యాంక్ సాధించింది. సమీక్షను ప్రముఖ డాక్టర్ బి.జవహర్‌తోపాటు బంధుమిత్రులు అభినందించారు.